క్లుప్తంగా

మంత్రి పెద్దిరెడ్డికి ఆహ్వానం



మంత్రి పెద్దిరెడ్డికి ఆహ్వానపత్రిక అందజేస్తున్న అపరంజిరాజు

నాగలాపురం: మండల కేంద్రంలో నిర్మించిన నూతన ప్రాథమిక ఆస్పత్రి భవన ప్రారంభోత్సవానికి రావాలని గురువారం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని నాగలాపురం మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ అపరంజి రాజు, నేతలు సురేష్, ఆనందయ్య మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రిక అందించి ఆహ్వానించారు.

సిపాయి భరోసా పంపిణీ



సిపాయి భరోసా పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం

రేణిగుంట: మండలంలోని వెంకటాపురానికి చెందిన వేలాయుధం రామచంద్రారెడ్డి కర్మక్రియలకు గురువారం హాజరైన ఎమ్మెల్సీ సభ్యుడు డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం సిపాయి భరోసా కింద నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఆయన కుటుంబాన్ని ఓదార్చి మృతుని కుమారుడు సుబ్రమణ్యంరెడ్డికి 40రకాల వస్తువుల కిట్‌ను అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ బాబు, కృష్ణారెడ్డి, పురుషోత్తంరెడ్డి, బలరాంరెడ్డి, మునీశ్వరమ్మ పాల్గొన్నారు.

31న సర్వసభ్య సమావేశం

పిచ్చాటూరు: ఈనెల 31న పిచ్చాటూరు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసులు తెలిపారు. ఎంపీపీ అధ్యక్షతన ఉదయం 10.30 గంటలకు స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జరిగే సమావేశానికి జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అధికారులు తప్పకహాజరుకావాలని కోరారు.

బాధ్యతల స్వీకరణ



ప్రేమ్‌కుమార్

నాగలాపురం: నాగలాపురం మండల డెప్యూటీ తహసీల్దార్‌గా ప్రేమ్ కుమార్ గురువారం ఉదయం బాధ్యతలు స్వీకరించారు. ఈయన రేణిగుంట నుంచి ఇక్కడికి బదిలీ అయ్యారు. గతంలో ఇక్కడ డెప్యూటీ తహసీల్దార్‌గా పనిచేసిన పునిధారాణి విజయపురం మండలానికి బదిలీ అయ్యారు.

మెగా రక్తదాన శిబిరం రేపు

శ్రీకాళహస్తి: పట్టణంలోని ఎంజీఎం ఆస్పత్రి ప్రాంగణంలో శనివారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు డైరెక్టర్ గుడ్లూరు మయూర్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఎంజీఎం గ్రూప్స్ చైర్మన్ గుడ్లూరు మల్లికార్జుననాయుడు జన్మదినాన్ని పురస్కరించుకుని ఈ మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దాతలు పెద్దసంఖ్యలో పాల్గొనాలని కోరారు.

హెచ్‌ఐవీపై అవగాహన



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో యూత్ ఫెస్ట్ కార్యక్రమాన్ని పురస్కరించుకుని రెడ్‌రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు ఎయిడ్స్, హెచ్‌ఐవీపై అవగాహన కల్పించారు. యువతలో ఎయిడ్స్ పట్ల అవగాహన కల్పించేందుకు కళాశాల విద్యార్థినులు మారథాన్‌లో ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ బి.రాజశేఖర్, వైస్ ప్రిన్సిపల్ దీనదయాల్, నరసింహారావు, రెడ్‌రిబ్బన్ కోఆర్డినేటర్ శైలజ, డాక్టర్ నీరజ, డాక్టర్ మాలతి, జమీల, పద్మప్రియ, సుమతి పాల్గొన్నారు.

రీసర్వేను సద్వినియోగం చేసుకోండి



గ్రామసభలో మాట్లాడుతున్న తహసీల్దార్

వరదయ్యపాళెం: భూరీసర్వేను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల తహసీల్దార్ గౌరిశంకరరావు రైతులకు సూచించారు. గురువారం కోవూరుపాడులో రీసర్వే విధివిధానాలను రైతులకు అవగాహన కల్పించేందుకు తహసీల్దార్ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నేటి నుంచి పది రోజులపాటు క్షేత్రస్థాయిలో సర్వే సిబ్బంది నిర్వహించే విచారణకు రైతులు సహకరించి వివరాలను వారికి అందజేయాలని తెలిపారు. సర్పంచ్ సామర్ల సుజాతమ్మ, ఎంపీటీసీ భువనేశ్వరి, మండల సర్వేయర్ వెంకటరమణ, ఆర్‌ఐ వేణుగోపాల్, వీఆర్వో చలపతి పాల్గొన్నారు.

ఆడపడుచుకు అభినందనలు

శ్రీకాళహస్తి: చంద్రయాన్–3 విజయోత్సవంలో కీలకపాత్ర పోషించిన శ్రీకాళహస్తి ఆడపడుచు, చంద్రయాన్–3 అసోసియేట్ డెప్యూటీ డైరెక్టర్ కల్పనకు స్థానిక యోగా అభ్యాసకులు అభినందనలు తెలిపారు. శ్రీశుకబ్రహ్మాశ్రమంలోని యోగా కేంద్రంలో సంబరాలు చేసుకున్నారు. యోగా అభ్యాసకురాలు కళ, యోగా గురువు మార్కండేయులు, శిక్షకులు భాస్కర్, గరికపాటి రమేష్‌బాబు, సూర్యకుమార్ పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతే లక్ష్యంగా పథకాలు

- వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని మరోసారి ఆశీర్వదించండి
- ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం



గొల్లపాళెంలో మహిళలకు బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

సత్యవేడు: పేదల అభ్యున్నతే లక్ష్యంగా రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం కోరారు. గురువారం గొల్లపాళెం (ఇరుగుళం పంచాయతీ), మల్లవారిపాళెం వెస్టు పంచాయతీలలో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాల లబ్ధిని వివరించి బుక్‌లెట్లను అందజేశారు. అంతకుముందు ఆయన మల్లవారిపాళెం వెస్ట్‌లో సిమెంటు రోడ్డు, పైప్‌లైను, రెండు ట్రాన్స్‌ఫార్మర్లను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గొల్లపాళెంలో 121 మందికి రూ.1.32 కోట్లు, మల్లవారిపాళెవెస్టులో 254 మందికి రూ.1.20 కోట్లు పలు పథకాల ద్వారా లబ్ధిపొందారన్నారు.

గర్భిణులకు సీమంతం..

గొల్లపాళెం అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో గర్భిణులకు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, సీడీపీఓ దేవకుమారితో కలిసి సీమంతం నిర్వహించారు. గర్భిణులకు రవిక, గాజులు, పసుపు, కుంకుమ, కిట్లు అందజేశారు. ఎంపీడీఓ చంద్రశేఖర్, తహసీల్దార్ షేక్ జరీనాబేగం, మండల కన్వీనర్ కే. సుశీల్‌కుమార్‌రెడ్డి, సురుటుపల్లి ఆలయ చైర్మన్ బాలాజీరెడ్డి, , సర్పంచులు జి. శేఖర్, నీరజ, సచివాలయ కన్వీనర్లు బి. సురేంద్రరెడ్డి, డీఎం కరుణాకర్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యురాలు మస్తాని, నేతలు కే. చంద్రశేఖర్‌రెడ్డి, ఆరూరు శేఖర్, రవిరెడ్డి, ఈ.గోవిందస్వామి, రమణ, బి.శ్రీధర్, బి. శశికిరణ్, ఏలుమలై, రాబిన్, కృష్ణయ్య పాల్గొన్నారు.

సజ్జలకు సాదర స్వాగతం



రేణిగుంట విమానాశ్రయంలో సజ్జల రామకృష్ణారెడ్డికి స్వాగతం పలుకుతున్న ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు, ఎమ్మెల్యేలు బియ్యపు మధుసూదన్‌రెడ్డి

రేణిగుంట: రాష్ట్రప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డికి గురువారం సాయంత్రం రేణిగుంట విమానాశ్రయంలో సాదర స్వాగతం లభించింది. తిరుపతి పర్యటన నిమిత్తం రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్న ఆయనకు విమానాశ్రయంలో శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు, శ్రీకాళహస్తి నియోజకవర్గ పరిశీలకులు ఓడూరు గిరిధర్‌రెడ్డి, రేణిగుంటకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు మన్యం శ్రీనివాసులురెడ్డి, గంగారి రమేష్, సుబ్బారెడ్డి తదితరులు స్వాగతం పలికారు. అనంతరం ఆయన రోడ్డు మార్గాన తిరుపతికి బయలుదేరి వెళ్లారు.

అర్హత ఉంటే సంక్షేమం అందాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదిమూలం

- ఎమ్మెల్యే ఆదిమూలం

నారాయణవనం: అర్హత ఉండి ఆగిపోయిన సంక్షేమ పథకాలను లబ్ధిదారులందరికీ అందివ్వాల్సిన బాధ్యత వలంటీర్లు, సచివాలయ సిబ్బందిపై ఉందని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పేర్కొన్నారు. గురువారం ఎంపీపీ దివాకర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొన్నారు. మూడు నెలల వ్యవధిలో మండలంలో జరిగిన అభివృద్ధిపై శాఖల వారీగా సమీక్షించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అందుతున్న సంక్షేమ పథకాలు ఆగిపోతే లబ్ధిదారులకు తిరిగి అందేలా కృషిచేయాలన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు పూర్తి అయినా ఎం, ఆర్బీకే, వెల్‌నెస్ కేంద్రాల భవనాలను నిర్మించకపోవడం శోచనీయమని అన్నారు. అర్హులకు రైస్ కార్డులను వెంటనే జారీ చేయాలని ఆయన సూచించారు. జగనన్న కాలనీల్లో నిర్మాణాలను వేగవంతం చేయాలని ఇంజినీరింగ్ అసిస్టెంట్లను ఆదేశించారు. జెడ్పీ ఫైనాన్స్ కమిటీ సభ్యులు కోనేటి సుమన్ కుమార్, ప్రత్యేక ఆహ్వానితులు సుదర్శనరెడ్డి, ఎంపీడీఓ గుణశేఖర్, తహసీల్దార్ ప్రమీల, డీసీసీబీ డైరెక్టర్ ఊరప్ప, అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

భూసమస్యను పరిష్కరించాలి



తహసీల్దారుకు సమస్యలను తెలుపుతున్న నాగరాజు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కుక్కంబాకం గ్రామ రెవెన్యూలోని దళితుల భూసమస్యలను పరిష్కరించాలని గురువారం సీపీఎం తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి వందవాసి నాగరాజు తహసీల్దార్ భార్గవికి విన్నవించారు. ఆయన మాట్లాడుతూ కుక్కంబాకం పరిధిలోని సర్వే నంబర్ 81లో 82 ఎకరాల భూమిని స్థానికేతరులు కబ్జా చేయాలని చూస్తున్నారని, ఈ భూమిని భూమిలేని బీసీ, ఎస్సీ, ఎస్టీలకు పంపిణీ చేయాలన్నారు. సీపీఎం సత్యవేడు నియోజకవర్గ ఇన్‌చార్జ్ జనార్దన్, నేతలు రమణయ్య, తిరుపాలు, చిన్నగురవయ్య, రమణయ్య, పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఏర్పేడు: మండలంలోని ఇసుకతాగేలి బీసీ కాలనీ వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఏర్పేడు సీఐ శ్రీహరి అందించిన వివరాలు.. వెంకటగిరికి చెందిన చరణ్(31), కుమార్(45) ద్విచక్ర వాహనంపై తిరుపతికి వెళ్తుండగా ఇసుకతాగేలి బీసీ కాలనీ వద్ద ఎదురుగా వస్తున్న లారీని తప్పించబోయి అదుపు తప్పడంతో ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. చికిత్స కోసం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చంద్రయాన్–3 విజయం దేశానికే గర్వకారణం



కరకంబాడిలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

రేణిగుంట: చంద్రయాన్–3 విజయం దేశానికే గర్వకారణమని కరకంబాడి హైస్కూల్ ఇన్‌చార్జ్ హెచ్‌ఎం మురళి అన్నారు. మండలంలోని కరకంబాడి, రేణిగుంట బాలికోన్నత పాఠశాల ఆవరణలో గురువారం విద్యార్థులు విజయోత్సవ ర్యాలీ, సంబరాలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విక్రమ్ ల్యాండర్‌ను చంద్రుని దక్షిణ ధృవంలో నిలిపారని, ప్రపంచ దేశాలు భారతావని వైపు చూసేలా ఇస్రో శాస్త్రవేత్తలు కృషి చేశారన్నారు. నేషనల్ గ్రీన్ కోర్ స్టేట్ కోఆర్డినేటర్ నీలకంఠ మాట్లాడుతూ ఇలాంటి ఘనత సాధించడం వల్ల పిల్లల్లో సాంకేతిక పరిశోధనల దిశగా యువత అడుగులు వేసేందుకు స్ఫూర్తి కలిగిందన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని విజయాలను భారత్ సాధించాలన్నారు. మువ్వన్నెల జెండాతో విద్యార్థులు ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగరాజు, మురళి, గోపి, సుశీల, మాలతి, భూపతిరెడ్డి, రామ్మోహన్, ముత్యాలరెడ్డి, రామచంద్రయ్య, సురేష్ తదితరులు పాల్గొన్నారు. అలాగే రేణిగుంట బాలికోన్నత పాఠశాల ఆవరణలో విద్యావికాస వేదిక ఆధ్వర్యంలో మువ్వన్నెల జెండా ఊపి సంబరాలు చేసుకున్నారు. విద్యావికాస వేదిక కన్వీనర్ వెంకటరమణ మాట్లాడుతూ 60ఏళ్ల ఇస్రో అంతరిక్ష పరిశోధనల గురించి విద్యార్థులకు వివరించారు. ప్రధానోపాధ్యాయులు విష్ణువర్ధనం, బ్రహ్మం, శ్రీదేవి, స్వప్న, ఉష తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడిగా బాలసుబ్రహ్మణ్యం



సమావేశానికి హాజరైన ఎమ్మార్పీఎస్ నాయకులు

తొట్టంబేడు(శ్రీకాళహస్తి): తొట్టంబేడు మండలం మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) అధ్యక్షుడిగా కె.బాలసుబ్రహ్మణ్యంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తొట్టంబేడులో గురువారం ఎమ్మార్పీఎస్ సన్నాహక సభ ఇర్ల రాజా మాదిగ ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా తిరుపతి జిల్లా ఇన్‌చార్జ్ మంద పెంచులయ్య మాదిగ, తిరుపతి జిల్లా కో–ఇంచార్జ్ వెంబడి రాధాకృష్ణ మాదిగ, తిరుపతి జిల్లా అధ్యక్షుడు తురక అమర్నాథ్ వడ్డెర, ఎమ్మార్పీఎస్ తిరుపతి జిల్లా అధ్యక్షుడు వేలూరు రాజేంద్ర మాదిగ హాజరయ్యారు. అనంతరం తొట్టంబేడు మండల కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో శ్రీకాళహస్తి పట్టణ యువజన అధ్యక్షుడు వెంకటముని, యతీశ్, ఈశ్వర్, బాలరాజు, మోహన్, చిన్న మధు, కుమార్, మురళి, ఉదయ్ పాల్గొన్నారు.

చంద్రయాన్–3 విజయవంతంపై అభినందనలు



బుచ్చినాయుడుకండ్రిగ: విజయోత్సవంలో విద్యార్థులు

బుచ్చినాయుడుకండ్రిగ: చంద్రయాన్–3 విజయవంతంతో ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలు తెలుపుతూ కల్లివెట్టు జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు విజయోత్సవం జరుపుకున్నారు. జయహో ఇస్రో..జయహో భారత్ అంటూ జాతీయ జెండాలు పట్టుకుని విజయోత్సవం చేసుకున్నారు. ఉపాధ్యాయులు యువశ్రీ మురళి, వేణుగోపాల్, నాదెండ్ల మురళి, దాసు, లక్ష్మయ్య, జగన్నాథం, మాధవీలత, దీపిక పాల్గొన్నారు.

నల్లగంగమ్మకు వెండి కవచం విరాళం



విరాళం అందజేస్తున్న దాతలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పట్టణంలోని తెట్టు కూడలి వద్ద వెలసిన నల్లగంగమ్మ ఆలయానికి రూ.80,116 కేజీ వెండి కవచాన్ని కాయం సుబ్బరామిరెడ్డి, మైనంపాటి దయాకర్, పోలూరు గోపాల్, పూల రామకృష్ణారెడ్డి సంయుక్తంగా అందజేశారు. ఈ కవచాన్ని ఆలయ చైర్మన్ కంఠా రమేష్ స్వీకరించి దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. అమ్మవారి దర్శన ఏర్పాట్లు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు యాదగిరి, అనిల్, పూజారి గుణ, కుప్పయ్య పాల్గొన్నారు.

ఆరోగ్య ఉపకేంద్ర స్థలం కబ్జా



సబ్‌సెంటర్ స్థలంలో నిర్మించిన గోడ

నారాయణవనం: శిథిలావస్థకు చేరుకున్న ఆరోగ్య ఉపకేంద్ర భవనాన్ని కూల్చి, ఓ వీఆర్‌ఏ ఇంటి నిర్మాణాలు చేపడుతున్న సంఘటన నారాయణవనంలో వెలుగులోకి వచ్చింది. కంచే చేను మేసిన చందాన ప్రభుత్వ స్థలాలను, భవనాలను పర్యవేక్షించాల్సిన గ్రామ వీఆర్‌ఏ అక్రమంగా ఇంటిని నిర్మించుకోవడంపై విమర్శలు వెల్లువెత్తాయి. వివరాలు ఇలా.. నారాయణవనంలోని పద్మసరస్సుకు సమీపంలో కుటుంబ నియంత్రణ, ఆరోగ్య ఉపకేంద్ర భవనాల నిర్మాణానికి 1971లో అప్పటి సర్పంచ్ శింగరయ్య కొండయ్య తన సన్నిహితుడైన దానా నరసింహులు నుంచి స్థలాన్ని రాష్ట్ర గవర్నర్ పేరున రిజిస్ట్రేషన్ చేయించారు. ఆరోగ్య వైద్యశాఖ నిర్మించిన భవనాల మరమ్మతులపై ప్రభుత్వాలు శ్రద్ధ చూపకపోవడంతో క్రమంగా శిథిలావస్థకు చేరుకుంది. దీంతో ఏఎన్‌ఎంలు సబ్ సెంటర్ కార్యకలాపాలను ఆరోగ్య ఉపకేంద్రం నుంచే నిర్వహించారు. గ్రామ వీఆర్‌ఏ భవన శిథిలాలను తొలగించి ఇంటి నిర్మాణం చేపట్టాడు. స్థానికుల సమాచారంతో మాజీ సర్పంచ్ శింగరయ్య కొండయ్య కుమారుడు పెరుమాళ్ గురువారం మండల వైద్యాధికారి దృష్టికి తీసుకొచ్చాడు. స్పందించిన వైద్యాధికారి దర్శిత్‌రాజ్, సీహెచ్‌ఓ శ్రీనివాసులు పరిశీలించారు. చర్యల నిమిత్తం జిల్లా అధికారులకు నివేదించామని దర్శిత్‌రాజ్ అన్నారు. వెల్‌నెస్ సెంటర్ నిర్మాణానికి పంచాయతీరాజ్ శాఖ శ్రద్ధచూపకపోవడంతో స్థలం ఆక్రమణకు గురైందని పెరుమాళ్ ఆరోపించారు. రెవెన్యూ, ఆరోగ్య వైద్య శాఖల అధికారులు చర్యలు తీసుకుని సబ్‌సెంటర్ స్థలాన్ని స్వాధీనం చేసుకుని వెల్‌నెస్ సెంటర్‌ను నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

విద్యార్థులకు బాల సాహిత్య కథల పోటీలు



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

బుచ్చినాయుడుకండ్రిగ: ఈనెల 29న వ్యవహారిక భాషా పితామహులు గిడుగు రామమూర్తిపంతులు జయంతిని పురస్కరించుకుని జరుపుకునే తెలుగు భాషా దినోత్సవంలో భాగంగా మండలంలోని కల్లివెట్టు జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులకు సాహిత్య కథలు, సామెతలు, పొడుపు కథలపై పోటీలను తెలుగు ఉపాధ్యాయులు యువశ్రీ మురళి నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పాఠశాల విద్యాశాఖ ఆదేశాల మేరకు వారం రోజుల పాటు రోజుకొక అంశంలో విద్యార్థులకు పోటీలు నిర్వహించి తెలుగు భాషా దినోత్సవం రోజున బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేస్తామని తెలిపారు. ఇన్‌చార్జ్ హెచ్‌ఎం సురేష్‌బాబు, ఉపాధ్యాయులు ప్రసాద్, లక్ష్మయ్య, వేణుగోపాల్, మాధవీలత, దాసు, జగన్నాథం పాల్గొన్నారు.

ముదిరాజ్ సంఘం నేతల ఆత్మీయ సమావేశం



వెదుళ్లచెరువులో సమావేశమైన ముదిరాజ్ సంఘ నేతలు

రేణిగుంట: నియోజకవర్గంలో 20 వేల పైచిలుకు జనాభా ఉన్న ముదిరాజ్ సామాజికవర్గానికి రాజకీయ పార్టీలు నామినేటెడ్ పదవులు కేటాయించి సముచిత స్థానాన్ని ఇవ్వాలని శ్రీకాళహస్తి నియోజకవర్గ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు వల్లమ్మ కన్నయ్య అన్నారు. ముదిరాజ్ ఆత్మీయ పలకరింపు కార్యక్రమం గురువారం సాయంత్రం మండలంలోని వెదుళ్లచెరువు, రామకృష్ణాపురం గ్రామాల్లో జరిగింది. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో గ్రామ, మండల స్థాయి కమిటీలను త్వరలోనే ఏర్పాటు చేసి ముదిరాజ్ సంఘాన్ని బలోపేతం చేయనున్నట్లు ఆయన తెలిపారు. శ్రీకాళహస్తి, రేణిగుంటలో ముదిరాజ్ కమిటీహాల్ నిర్మాణానికి ప్రభుత్వం స్థలం కేటాయించాలని కోరారు. యూనియన్ ద్వారా ముదిరాజ్‌ల సంక్షేమానికి అనేక కార్యక్రమాలను చేపట్టనున్నట్లు ఆయన వివరించారు. కార్యక్రమంలో యూనియన్ గౌరవ సలహాదారు తోటకూర కోటేశ్వరరావు, కోశాధికారి గోవిందస్వామి, గురుమూర్తి, పవన్, ఈశ్వర్, సుబ్రమణ్యం, నిరంజన్, మంజుల, కాళప్ప పాల్గొన్నారు.

నకిలీ పట్టాదారులపై కేసులు పెట్టండి

–ఆర్డీఓ చంద్రముని



ఇందిరానగర్‌లో రోడ్డును పరిశీలిస్తున్న ఆర్డీఓ

వరదయ్యపాళెం: నకిలీ పట్టాలతో భూఆక్రమణలకు పాల్పడుతున్న వారిపై క్రిమినల్ కేసులు పెట్టాలని ఆర్డీఓ చంద్రముని, తహసీల్దార్‌ను ఆదేశించారు. గురువారం ఇందిరానగర్, గోపాలరావుకాలనీలలో ఆక్రమణలకు గురవుతున్న భూములను ఆయన పరిశీలించారు. క్షేత్రస్థాయిలో వీఆర్వోలు విచారణ చేసి నిజమైన లబ్ధిదారులకు న్యాయం చేయాలన్నారు. అలాగే మండల పరిషత్ కార్యాలయాల మీదుగా ఇందిరానగర్, పద్మావతిపురం గ్రామస్తులకు ప్రభుత్వ కార్యాలయాల సముదాయం వైపుగా గతంలో ఉన్న దారిని యథావిధిగా కొనసాగించేందుకు స్థానికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ నిర్వహించారు. అయితే ప్రభుత్వ భూముల్లో అనుమతి లేకనే కట్టడాలు నిర్మించడంపై ఆర్డీఓ ప్రశ్నించారు. ప్రజా అవసరాలకు దారి అవసరమైతే పరిశీలించి చర్యలు తీసుకుంటామని ఫిర్యాదుదారునికి హామీ ఇచ్చారు. తహసీల్దార్ గౌరిశంకరరావు, సర్వేయర్ రమణ, ఆర్‌ఐ వెంకటరమణ పాల్గొన్నారు.

పురాతన ఆలయ జీర్ణోద్ధరణ పనులకు భూమిపూజ



శివాలయ జీర్ణోద్ధరణ పనులను ప్రారంభిస్తున్న చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పట్టణంలోని ఈటీసీ కేంద్రం వద్ద ఉన్న పురాతన శివాలయ జీర్ణోద్ధరణ పనులకు గురువారం శ్రీకాళహస్తీశ్వరాలయ పాలక మండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.12 లక్షల వ్యయంతో పురాతన రాజులకాలం నాటి శివాలయానికి జీర్ణోద్ధరణ చేసి పూర్వవైభవం కలిగే విధంగా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. త్వరలోనే మహాకుంభాభిషేకం నిర్వహించి పూర్వ వైభవం చేస్తామన్నారు. కార్యక్రమంలో పసల సుమతి, ఆలయ అధికారులు పవన్‌కుమార్ బాలాజీ, ప్రముఖులు పసల కుమారస్వామి, పసల భార్గవ, ఈటీసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఆర్థికసాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న బియ్యపు ఆకర్ష్‌రెడ్డి

శ్రీకాళహస్తి: నియోకవర్గపరిధిలో నిరుపేదలు ఎవరు మరణించినా ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి తానున్నానంటూ భరోసా ఇస్తున్నారు. అందులో భాగంగా పట్టణంలోని దర్గామిట్టకు చెందిన షేక్ జాఫర్, నిర్మల, షేక్ అబ్దుల్లా, ఏఎం పుత్తూరుకు చెందిన చిన్నప్ప అనే నిరుపేదలు ఇటీవల అనారోగ్యంతో మరణించారు. వారి మృతి విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి తన కుమారుడు బియ్యపు ఆకర్ష్‌రెడ్డి ద్వారా గురువారం మృతుల కుటుంబ సభ్యులను గురువారం పరామర్శించారు. ఒక్కో కుటుంబానికి రూ.10 వేలు చొప్పున రూ.40 వేలు ఆర్థికసాయం అందజేశారు. అలాగే వారికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు మున్నా రాయల్ తదితరులు పాల్గొన్నారు.

దామోదర రెడ్డికి అభినందనలు



దామోదరరెడ్డిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పట్టణ వైఎస్సార్‌సీపీ యువత అధ్యక్షుడిగా తలపా దామోదర రెడ్డికి గురువారం ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి నియామకపత్రం అందజేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.

వరలక్ష్మీ వ్రతానికి ఏర్పాట్లు



బ్రహ్మగుడి వద్ద ఏర్పాటు చేసిన వేదిక

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని బ్రహ్మగుడి ఆవరణంలో శుక్రవారం వరలక్ష్మీ వ్రతం వేడుకలు ఘనంగా జరగనున్నాయి. వరలక్ష్మీ వ్రతంతో భక్తులు భారీగా పాల్గొనే అవకాశం ఉండడంతో ఎవరూ ఇబ్బంది పడకుండా ఆలయ అధికారులు భారీగా ఏర్పాట్లు చేశారు.

ఓటర్ల జాబితా పరిశీలన



ఓటర్ల జాబితాను పరిశీలిస్తున్న అధికారులు

నాగలాపురం: కలెక్టర్ ఆదేశాల మేరకు 2022 జనవరి నుంచి ఇప్పటివరకు తొలగించిన ప్రతి ఓటును క్షేత్రస్థాయిలో వెళ్లి పునఃపరిశీలన చేయాలని బీఎల్‌ఓలను ఆదేశించారు. ఈ ప్రక్రియలో భాగంగా 169 –సత్యవేడు నియోజకవర్గం నాగలాపురం మండలంలో అధికారులు నాగలాపురం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ప్రసన్నకుమార్, డీటీ ప్రేమ్‌కుమార్, వీఆర్‌ఓలతో కలిసి పరిశీలించారు.